21,22 తేదీలలో జాతీయ సింపోజియం



విద్యార్థులు తయారు చేసిన సీతారామ సాగర్ ఎత్తిపోతల చిత్రం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 21, 22 తేదీలలో జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం జరుగనుంది. ఈ మేరకు వివిధ విభాగాలు ముస్తాబయ్యాయి. బుధవారం సింపోజియం ఏర్పాట్లను ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ పర్యవేక్షించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలు, ఎన్ఐటీ, ఐఐటీల విద్యార్థులు హాజరుకానున్నట్లు ప్రొ.చంద్రశేఖర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలపడంతో కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ నేతలు కార్ఖాన లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మూడో వార్డు అధ్యక్షుడు ఉత్తరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శాంసన్‌రాజు, నాగరాజు, మహేందర్, శరత్ పాల్గొన్నారు.

వృద్ధులకు పరికరాల పంపిణీ...



సనత్‌నగర్: హెల్పేజ్ ఇండియా సహకారంతో అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట పాటిగడ్డ ఎస్‌బీటీనగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం వయోవృద్ధులకు ఊత పరికరాలను అందజేశారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు వీల్‌చైర్లు (3), ఫోల్డబుల్ వాకర్స్ (9), వాకింగ్ స్టిక్స్ (13),క్వాడ్రిపాడ్ స్టిక్స్ (11)ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్సా సంస్థ కో–ఆర్డినేటర్ బస్వరాజ్, నిర్వాహకురాలు రాజేశ్వరి, బస్తీ అధ్యక్షుడు శేఖర్‌ముదిరాజ్, నీసంబాను, శోభా సల్మాన్, విజయలక్ష్మీ, ఇలియాజ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు వేచి ఉండే గదిలో మహిళ మృతి చెందినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు సదరు మహిళ అనారోగ్యంతో అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. సుమారు 55 ఏళ్ల వయసున్న సదరు మహిళ వివరాలు పోలీసులకు లభించలేదు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలు ప్రయాణంలో వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సర్ఫరాజ్‌బేగ్ (34) అనారోగ్యానికి గురికావడంతో నాగపూర్ బందారా రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్పించారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఇంటికి తీసుకువెళ్లేందుకు సర్ఫరాజ్‌బేగ్‌ను సోదరుడు వెంట తీసుకుని ముజాఫాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరారు. రైలు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాక బోగీ నుంచి కిందకుదిగే సమయంలో కుప్పకూలిపోయిన సర్ఫరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 20, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 25, ఆలుగడ్డ 25, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



జలం.. జటిలం

- కంటోన్మెంట్‌లో తగ్గిన నీటి సరఫరా
- ఎండిపోతున్న బోర్లు..
- నెల ముందే సమ్మర్ యాక్షన్ ప్లాన్
- నీటి ఎద్దడి తీవ్రం కావడంతో అధికారుల ముందస్తు ప్రణాళిక
- ట్యాంకర్లు సిద్ధం చేసిన బోర్డు అధికారులు



తాగునీటి ఎద్దడిపై బోర్డు అధికారులతో సమీక్షిస్తున్న బోర్డు సభ్యురాలు భానుక నర్మద

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో పుష్కర కాలం తర్వాత మళ్లీ నీటి ఎద్దడి తీవ్రరూపం దాలుస్తోంది. పెద్ద సంఖ్యలో బోర్లు ఎండిపోతున్నాయ్.. కంటోన్మెంట్‌కు జలమండలి సరఫరా చేసే నీటి మోతాదు తగ్గడంతో మంచినీటికి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ముందస్తుగానే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి కార్యాచరణ చేపట్టారు. ప్రతీయేటా ఏప్రిల్ నెలాఖరులో ప్రారంభమయ్యే 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను ఈ సారి మార్చి మూడోవారంలోనే ప్రారంభించడం గమనార్హం. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల సంఖ్యను పెంచుతామని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్, వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌లు ప్రత్యేకంగా భేటీ అయ్యి నీటి ఎద్దడి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ మేరకు ప్రాథమికంగా రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేశారు.

బోర్లు ఎండిపోతున్నాయ్..

కంటోన్మెంట్ వ్యాప్తంగా సుమారు 400 కాలనీలు, 50కి పైగా బస్తీలున్నాయి. ఆయా నివాస ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో వేసిన బోర్‌వెల్స్ నిర్వహణ బాధ్యతలను బోర్డు చూసుకుంటుంది. ఈ మేరకు బోర్డు నిర్వహణలో ఉన్న 586 బోర్‌వెల్స్ పంప్‌సెట్‌లు రిపేరుకు వచ్చాయి. క్షేత్రస్థాయిలో మరమ్మతులు చేసేందుకు వెళ్లిన సిబ్బందికి విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. పదుల సంఖ్యలో బోర్లలో నీరు ఇంకిపోయినట్లు తేలింది. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు అధికారులకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇక వచ్చే నెలలో మరిన్ని బోర్‌వెల్స్‌లో నీరు ఇంకిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. ఇక నివాసాల్లోని ప్రైవేటు బోర్‌వెల్స్, కాలనీ బోర్‌వెల్స్ సైతం ఎండిపోతే ట్యాంకర్లకు డిమాండ్ పెరగొచ్చని అంచనా వేస్తున్నారు.

తగ్గిన నీటి సరఫరా..

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు జలమండలి రోజుకు 6.3 లక్షల మిలియన్ గ్యాలన్ల నీటి సరఫరా చేయాలనే ఒప్పందం ఉండేది. అయితే సరఫరా మాత్రం రోజుకు 5.9 లక్షల మిలియన్ గ్యాలన్‌లు మాత్రమే ఉండేది. అయితే జనాభా అవసరాలకు అనుగుణంగా అగ్రిడ్ క్వాంటిటీని పెంచాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ విజ్ఞప్తి మేరకు రోజుకు అదనంగా లక్ష గ్యాలన్ల నీటి సరఫరా చేసేందుకు అంగీకరించింది. 7.3 లక్షల మిలియన్ గ్యాలన్‌లకు ఒప్పందం కుదరగా, రోజుకు 6.9 లక్షల మిలియన్ గ్యాలన్‌లు సరఫరా చేస్తోంది. తాజాగా ఈ సరఫరా మోతాదు తగ్గడంతో నీటి ఎద్దడి పెరుగుతోంది. నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో సరఫరా చేసేందుకు బోర్డు అధికారులు 10 ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి రోజుకు 60 ట్రిప్పుల చొప్పున నీటి సరఫరా జరుగుతోంది. డొమెస్టిక్ ట్యాంకర్‌కు రూ.500, కమర్షియల్ ట్యాంకర్‌కు రూ.850 చొప్పున వసూలు చేయనున్నారు. ఒక్కో ఇంటికి నెలకు గరిష్ఠంగా 8 ట్యాంకర్‌లు మాత్రమే పంపనున్నారు. ఈ చావనీ ద్వారా లేదా, 9490611191, 9490611192 నెంబర్‌ల కాల్ చేసి ట్యాంకర్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. బొలంరాయి, రైల్వేకాలనీ, లోతుకుంట, గన్‌బజార్, గన్‌రాక్ పంప్ హౌజ్‌ల వద్ద కూడా ట్యాంకర్‌లను బుక్‌చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవిలో తాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించాం. ఈ మేరకు సీఈఓ మధుకర్ నాయక్, వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌లో చర్చించి, యాక్షన్ ప్లాన్ రూపొందించాం. తాగునీటి డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు మార్పులు చేపట్టాల్సిందిగా అధికారులకు సూచించాం.

– భానుక నర్మద, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



మడ్‌ఫోర్ట్ పాఠశాల్లో ఫుడ్‌ఫెస్టివల్ దృశ్యాలు

రసూల్‌పురా: మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల్లో బుధవారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కవిత నేతృత్వంలో పాఠశాల సాంస్కృతిక ఇంచార్జి ఇందిరా ఆధ్వర్యంలో ప్రాథమిక తరగతి విద్యార్థులు శాండ్‌విచ్, ఫ్రూట్ సలాడ్, ఫ్రూట్ బౌల్, పులిహోర, హల్వా, గులాబ్‌జామూన్, లస్సీ తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఇందిరా మాట్లాడుతూ జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన పోషక విలువలతో కూడిన ఆహారల ఉపయోగాలను వివరిస్తూ ఫుడ్‌ఫెస్టివల్ కొనసాగిందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, సౌజన్య, సునీత కుమారి, స్వరూప, శ్రీలత, షరీఫున్నీసా, ఖదర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితంగానే వర్గీకరణ బిల్లు



మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ బన్సీలాల్ పేట్‌లో ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలేసి మంద క్రిష్ణమాదిగ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. 30 ఎండ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మార్గం సుగమమైయిందన్నారు. కార్పొరేటర్ కె. హేమలత, నాయకులు లక్ష్మీపతి, కేఎం క్రిష్ణ, విజయ్ శంకర్, రాపాక అశోక్, బట్టు క్రిష్ణ తదితరులు మాట్లాడారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంద క్రిష్ణ మాదిగ రాజీలేని పోరాటం, ఉద్యమఫలితంగానే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. తల్లిదండ్రుల ఉమ్మడి ఆస్తిని పిల్లలందరికి కూడా దక్కే అవకాశం వర్గీకరణ బిల్లు ఆమోదంతో లభించిందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, హరిబాబు, జగ్గు, రాజు, జనార్దన్, శంకర్, పరమేష్, ఫయామ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమివ్వండి



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న భానుక నర్మద

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో చేపట్టబోయే ఇంజనీరింగ్ పనుల్లో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యమివ్వాలని బోర్డు సభ్యురాలు భానుక నర్మద ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బోర్డు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణికుమార్, సీఈ ఉమాశంకర్‌లతో పాటు ఎనిమిది వార్డులకు సంబంధించిన ఇంజనీర్లు సమావేశంలో పాల్గొన్నారు. నిధుల లభ్యతకు అనుగుణంగా అత్యవసర పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్షణ మరమ్మతులు చేపట్టాల్సిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలనీలు, బస్తీల పట్ల వివక్ష లేకుండా అన్ని వార్డుల పరిధిలో ఏకరీతిలో పనులు చేపట్టాలన్నారు. తాగు నీరు, డ్రైనేజీ నీరు కలిసి పోయే ప్రమాదమున్న ప్రాంతాలను గుర్తించి, నూతన లైన్‌లు వేయాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయగలను అనే ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాస్తే తప్పకుండా ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని సైకాలజిస్టు జ్యోతి రాజా అన్నారు. బుధవారం లాలాపేటలోని మార్కెట్ ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో రెయిన్ బో హోమ్స్ ప్రోగ్రాం, బ్లూ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు 'భయం వీడితే జయం మనదే ' అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు జ్యోతి రాజా హాజరై మాట్లాడుతూ పరీక్షలను ఏలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థులకు పలు మెలుకువలను చెప్పారు. బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ వి. క్రాంతి కిషోర్ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులను అందజేశారు.

సకాలంలో వైద్యం అందించడం ముఖ్యం



ఆర్థిక సహాయ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సకాలంలో వైద్యం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉంటుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేటలోని సీ–క్లాస్‌కు చెందిన శరణ్‌కుమార్ కొద్దికాలంగా నరాల సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా చికిత్సకు సహాయం కోసం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఆర్థిక సహాయ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: రంజాన్ పండుగ నేపథ్యంలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే తగిన పరిష్కారం చూపుతానని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. బౌద్ధనగర్‌లోని మసీదు కమిటీ సభ్యులతో బుధవారం వార్డు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం, మసీదు కమిటీ సభ్యుల నుంచి రంజాన్ ఇనామ్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, యూసీడీ సీఓ వరుణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: పేద విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బిజుమల్ల మాధవ సూర్యనారాయణ శర్మ సిద్ధాంతి స్మారక సేవా భారతీ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు బిజుమల్ల బింధు మాధవ శర్మ కోరారు. బుధవారం తిరుమలగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. అంతేకాక చదువులో ముందున్న అన్ని తరగతులు విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న క్రీడల్లో రాణించేందుకు వాటిపై కూడా ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను హరించే ఉత్తర్వులు రద్దు చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల స్వేచ్ఛను హరించేలా ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొ. జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. డా.బీఆర్ అంబేద్కర్‌కు డాక్టరేట్ పట్టా ఇచ్చి గౌరవించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తన చరిత్రను తానే చెరిపి వేసుకుంటూ అప్రజాస్వామిక ఉత్తర్వులివ్వటం సరైన చర్య కాదన్నారు. విశ్వ విద్యాలయాలకు చర్చలు, సమావేశాలు జరిపే స్వేచ్ఛ, అవసరమైతే పోరాడే స్వేచ్ఛకు ఆటంకాలుండకూడదని పేర్కొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన నూతన ఎస్‌ఈ



డిప్యూటీ మేయర్‌తో ఎస్‌ఈ ఆశాలత

లాలాపేట: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ సూపరెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆశాలత బుధవారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఈకి శుభాకాంక్షలు తెలిపి అభినందించిన డిప్యూటీ మేయర్ సికింద్రాబాద్ నియోజక వర్గంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలనీ సూచించారు. స్వచ్ఛ సుందర సికింద్రాబాద్‌కు పాటుపడాలని పేర్కొన్నారు.

నాలా నిర్మాణ పనులు పూర్తి చేయాలి



ఇంజినీరింగ్ విభాగం అధికారితో మాట్లాడుతున్న కార్పోరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌లో చేపట్టిన వరదనీటి నాలా నిర్మాణం పనులు సత్వరమే పూర్తి చేయించాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి నాలా నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. అనందరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇందిరానగర్‌లో రూ.90 లక్షల వ్యయంతో ప్రారంభించిన నాలా నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయించి ఇబ్బందులు తొలగిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కంటోన్మెంట్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సంస్థ నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు కిషోర్ కుమార్, మహేశ్, దుర్గయ్యల ఆధ్వర్యంలో మంగళవారం జేబీఎస్ ఆవరణలోని ఈడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 పే స్కేలు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు కెం.ఎం.ఎస్. రెడ్డి, కె.వి. రామనర్సయ్య పాల్గొన్నారు.

ఎల్‌టీ ఏబీ కేబుల్ ఆధారిత స్ట్రీట్‌లైట్స్ ప్రారంభం

సనత్‌నగర్: జెకేకాలనీలో వీధిదీపాల వెలుగులు విరజిమ్మాయి. వీధిదీపాల సమస్య విషయమై ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్‌చందులు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులు రూ.5 లక్షలను మంజూరు చేయడమే కాకుండా ఎల్‌టీ ఏబీ కేబుల్‌ను ఏర్పాటుచేసి వీధిదీపాలకు కనెక్షన్ ఇచ్చి బుధవారం సాయంత్రం వీధిదీపాల డీఈఈ కిరణ్మయి ప్రారంభించారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఎప్పటికీ ఉంటుందన్న విషయం మరిచిపోవద్దని బీజేపీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. సనత్‌నగర్‌లో బుధవారం ఆయన పర్యటించి స్థానికంగా ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆయనను పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌పై కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు

సనత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాల నుంచి అనేక పోరాటాలు జరిగాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించిన నేపథ్యంలో బుధవారం బన్సీలాల్‌పేటకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వారు శాలువాతో సత్కరించారు. బిల్లు ఆమోదం పొందడం పట్ల వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్సీ నాయకులు లక్ష్మీపతి, జగదీష్, శివ, పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈగా ఆశాలత



ఎమ్మెల్యే పద్మారావుతో ఎస్‌ఈ ఆశాలత

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఆశాలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఆశాలత ఎస్‌ఈగా పదోన్నతి పొందారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

అడ్డగుట్ట: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జోనల్ కన్వీనర్ అజయ్ బాబు కోరారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు మమత, విజయ, రేణుక, ఫాతిమా, విజయలక్ష్మి, లక్ష్మి, రేచల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌ఎస్‌సి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, శేషగిరిరావులు మాట్లాడారు. విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు బాగా రాయాలన్నారు.